క్లుప్తంగా

మల్టీ విటమిన్‌ ట్యాబ్లెట్ల పంపిణీ



తిరువూరురూరల్‌: చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని విద్యార్థులకు సీ విటమిన్‌, మల్టీ విటమిన్‌ ట్యాబ్లెట్లను ఆరోగ్య కార్యకర్తలు శనివారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కనకదుర్గాభవాని ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ట్యాబ్లెట్లను అందజేశారు.

సెక్టార్‌-2 ఎస్‌ఐగా వెంకటేశ్వరరావు



తిరువూరు: తిరువూరు పోలీసుస్టేషన్‌లో ఖాళీగా ఉన్న సెక్టార్‌-2 ఎస్‌ఐగా జి. వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఆయన తిరువూరు సర్కిల్‌లోనే కానిస్టేబుల్‌గా, హెడ్‌ కానిస్టేబుల్‌గా, ఏఎస్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించారు. ఐడీ పార్టీలో పనిచేసినప్పుడు కూడా పలు నేరాల్లో నిందితులను గుర్తించి సొత్తు రికవరీలో చురుకుగా వ్యవహరించారు. వెంకటేశ్వరరావుకు సెక్టార్‌-1 ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది శనివారం స్వాగతం పలికారు.

రేషన్‌ బియ్యం స్వాధీనం



తిరువూరు: కోళ్ల ఫారాలకు అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని తిరువూరు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రేషన్‌ బియ్యంతో వస్తున్న ఆటోను జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పౌరసరఫరాల అధికారులకు సమాచారం ఇచ్చిన అనంతరం కేసు నమోదు చేశారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

ఎస్‌ఐ రామకృష్ణ

చాట్రాయి: గ్రామాల్లో శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని సోమవరం గ్రామంలో నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, రహదారుల భద్రత, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలను చెరువులు, కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం, పిడుగులు పడేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల, చెట్ల కింద నిలబడకూడదని ఆయన సూచించారు.

రామాలయం హుండీ కానుకల లెక్కింపు



చాట్రాయి: చనుబండ కోదండ రామాలయం హుండీ కానుకల లెక్కింపును శనివారం నిర్వహించారు. ఏడాది కాలానికిగాను రూ. 1.18 లక్షలు, ఆలయ భూములు కౌలు వేలం ద్వారా రూ.77 వేలు ఆదాయం లభించిందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు.

అధ్వానంగా వట్టిగుడిపాడు- చొప్పరమెట్ల రోడ్డు



ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు నుంచి ఈదులగూడెం, చొప్పరమెట్ల వరకు రోడ్డంతా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. రోడ్లకు మరమ్మతులు చేయాలని ఏడాది కాలం నుంచి కూటమి ప్రభుత్వాన్ని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నా పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం హంగామా చేసింది తప్ప, ఈ రోడ్లకు మాత్రం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లోకి నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వట్టిగుడిపాడు నుంచి చొప్పరమెట్ల వరకు రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అరకొర బస్సులు.. అందని సేవలు

- నియోజకవర్గంలో 28 గ్రామాలకు సర్వీసులు నిల్‌
- ప్రయాణికుల విన్నపాలు పట్టించుకోని ఆర్టీసీ
- కొత్త బస్సుల ఊసేలేదు
- సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు ట్రావెల్స్‌
- అభివృద్ధికి దూరంగా తిరువూరు ఆర్టీసీ డిపో



తిరువూరు ఆర్టీసీ బస్టాండు

తిరువూరు: సుమారు ఆరు దశాబ్దాల కిందట ఏర్పాటైన తిరువూరు ఆర్టీసీ బస్‌ డిపో అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత ఈ డిపో పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ప్రాంత ప్రజలకు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం- కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతో ఉన్న అనుబంధం కారణంగా గతంలో అధిక సంఖ్యలో బస్సు సర్వీసులు తిరువూరు డిపో నిర్వహించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సగానికి పైగా సర్వీసులు రద్దు చేయడంతో ఆయా జిల్లాలకు వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం, సత్తుపల్లి రూట్లలో తిరువూరుకు తెలంగాణ ఆర్టీసీ నడుపుతున్న బస్సు సర్వీసులు ప్రయాణికుల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలే ఈ రూట్లలో ఎక్కువగా ప్రయాణికులను చేరవేస్తున్నాయి. ఇప్పటికీ తిరువూరు నియోజకవర్గంలో 28 గ్రామాలకు బస్సు సర్వీసులు లేకపోవడం గమనార్హం.

కండీషన్‌లో లేని బస్సులు

తిరువూరు డిపోలో ఆర్టీసీ బస్సులు 52, అద్దె బస్సులు 26 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలకు నడిచే సర్వీసుల్లో పల్లె వెలుగు బస్సులు కండీషన్‌లో లేకపోవడంతో మార్గమధ్యంలోనే ఆగిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. హైదరాబాద్‌కు తిరువూరు డిపో నడిపే సూపర్‌ లగ్జరీ సర్వీసుల్లో సీట్లు పాడైపోయి, కిటికీలు కదలక మొరాయిస్తూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. పగలు హైదరాబాద్‌కు సర్వీసులు రద్దు చేయడంతో ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌ వెళ్లవలసి వస్తోందని పలువురు వాపోతున్నారు. గతంలో తెల్లవారుజామున ఐదు గంటలకు, ఉదయం ఏడు గంటలకు ఉండే హైదరాబాద్‌ సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తిరువూరు ఆర్టీసీ డిపోకు ఏసీ, సూపర్‌ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌ బస్సులు కొత్తవి కేటాయించాలని కూడా పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌ హవా

ప్రయాణికుల అవసరాల మేరకు తిరువూరు డిపో నుంచి బస్సు సర్వీసులు నిర్వహించకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ అధిక సంఖ్యలో బస్సులు నడుపుతున్నాయి. హైదరాబాద్‌, బెంగళూరు, చెన్నై, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు తిరువూరు నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌ నడుపుతున్న సర్వీసులు ప్రయాణికుల ఆదరణ చూరగొంటున్నాయి. సెమీ స్లీపర్‌, స్లీపర్‌, ఏసీ సర్వీసులకు ప్రయాణికులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

తిరువూరు డిపోలో బస్సుల వివరాలు	
సూపర్‌ లగ్జరీ	25
ఎక్స్‌ప్రెస్‌	13
అల్ట్రా డీలక్స్‌	6
అల్ట్రా పల్లె వెలుగు	2
పల్లె వెలుగు	32

బస్సుల కండీషన్‌ మెరుగుపరచాలి



గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులకు కిటికీ అద్దాలు లేక, సీట్లు విరిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కండీషన్‌ మెరుగుపరచి నూజివీడు, విజయవాడ, మచిలీపట్నం, ఏలూరు రూట్లలో అవసరమైనన్ని బస్సులు నడపాలి. గతంలో రద్దు చేసిన తెలంగాణ రూట్లలో పల్లె వెలుగు సర్వీసులు పునరుద్ధరించాలి.

– మోదుగు శివయ్య, ముష్టికుంట్ల

దూర ప్రాంత సర్వీసులు నడపాలి



తిరువూరు నుంచి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి. గతంలో విశాఖపట్నం, రాజమండ్రి, బెంగళూరు, కడప, నాగాయలంక, ద్వారకా తిరుమల, నాగార్జున సాగర్‌ తదితర ప్రాంతాలకు నడిపిన సర్వీసులు పునరుద్ధరించాలి. తిరువూరు బస్టాండులో వర్షాకాలం ప్లాట్‌ఫారాలు మునిగిపోయి ప్రయాణికులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నందున ఎత్తు పెంచాలి.

– నాగిరెడ్డి, అక్కపాలెం

గుంతలమయం

- రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు



అధ్వానంగా మారిన జి.కొండూరు-మునగపాడు ప్రధాన రహదారి



గడ్డమణుగు ఎస్సీ కాలనీ వద్ద ప్రమాదకరంగా దర్శనమిస్తున్న రహదారిపై మట్టి కుప్పలు

జి.కొండూరు: జి.కొండూరు గెయిల్‌ ఇండియా కంపెనీ నుంచి గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా మునగపాడు వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ రహదారి జి.కొండూరు నుంచి గంగినేని మీదుగా ఖమ్మం జిల్లాలోకి వెళ్లే వాహన చోదకులకు చెర్వుమాధవరం వెళ్లకుండా షార్ట్‌కట్‌గా ఉంది. ఈ రహదారి మీదుగా గడ్డమణుగు లోయలోని క్వారీలు, క్రషర్ల నుంచి మెటల్‌ కంకర లోడుతో భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిపై గుంతలు ఏర్పడటంతో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తవ్వి వదిలేశారు..

జి.కొండూరు నుంచి మునగపాడు వెళ్లే షార్ట్‌కట్‌ ప్రధాన రహదారిలో గడ్డమణుగు ఎస్సీ కాలనీ వద్ద నెట్‌ వర్క్‌ కేబుళ్లను ఏర్పాటు చేసేందుకు రెండు పెద్ద గుంతలను తవ్వి అలానే వదిలేశారు. గుంతలు తవ్వగా వచ్చిన మట్టిని రహదారిపై పెద్ద పెద్ద కుప్పలుగా వేశారు. ఈ మట్టి కుప్పలను రోజుల తరబడి రహదారిపై ఉంచడం వల్ల రాత్రి సమయాల్లో మట్టి కుప్పలను ఢీకొని ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహన చోదకులు విధిగా హెల్మెట్‌ ధరించాలి



లక్ష్మీపురం(తిరువూరురూరల్‌): ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌ ధరించాలని తిరువూరు సెక్టార్‌-1 ఎస్‌ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాల తనిఖీ సందర్భంగా హెల్మెట్‌ లేకుండా ప్రయాణిస్తున్న వాహన చోదకులకు ఆయన శనివారం సాయంత్రం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు అధిక శాతం వాహన చోదకులు హెల్మెట్‌ లేనికారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు విధిగా ప్రతి వాహన చోదకుడు హెల్మెట్‌ ధరించాలని చెప్పారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ముసునూరు: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి కె.చినసూరిబాబు తెలిపారు. రాయితీపై లభిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పట్టాదారు పాస్‌ పుస్తకం, ఆధార్‌ కార్డు జిరాక్స్‌ కాపీలతో గ్రామంలోని ఆర్‌ఎస్‌కేలోనే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పొందవచ్చన్నారు.

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

న్యాయమూర్తి హిమబిందు



మాట్లాడుతున్న న్యాయమూర్తి హిమబిందు

జగ్గయ్యపేట అర్బన్‌:చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి హిమబిందు అన్నారు. ఈ నెల 25 న పిల్లల మిస్సింగ్‌ డే సందర్భంగా శనివారం స్థానిక కింగ్స్‌ స్పోకెన్‌ ఇంగ్లిష్‌ ఇనిస్టిట్యూట్‌లో మండల లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి హిమబిందు మాట్లాడుతూ పిల్లలు గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడవద్దని, పరిచయం లేని వారి నుంచి చాక్‌లెట్లు గానీ, బహుమతులు గానీ తీసుకోవద్దని సూచించారు. ఒంటరిగా ప్రయాణించవద్దని, పాఠశాల, ట్యూషన్‌, ఆటలకు వెళుతున్నప్పుడు స్నేహితులు లేదా పెద్దలతో వెళ్లాలన్నారు. అత్యవసర సమయంలో సమాచారం అందించేందుకు పిల్లలు తల్లిదండ్రుల ఫోన్‌ నంబర్‌, ఇంటి అడ్రస్‌ గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఎవరైనా బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే వీరు నాకు తెలిసిన వారు కాదని గట్టిగా అరవాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే అత్యవసర నంబర్లు 100 (పోలీసు), 1098 (చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌)కు ఫోన్‌ చేయాలని సూచించారు. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, సెక్రటరీ మెట్టెల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, న్యాయవాదులు రాయపూడి శ్రీనివాసరావు, అన్నెపాగ కరుణ, ఉప్పుతళ్ల అంకమరాజు, మురళి, నరేష్‌, శ్రావణకుమార్‌, విజయకుమారి, ఇనిస్టిట్యూట్‌ డైరెక్టర్‌ అమరనాథ్‌, పారా లీగల్‌ వలంటీర్లు పాల్గొన్నారు.

2న ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

ముసునూరు: జూన్‌ 2 నుంచి 5వ తేదీ వరకు చెక్కపల్లిలో శ్రీకృష్ణ పరమాత్మ ఆలయ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లా మైలవరం నుంచి మంగళ వాయిద్యాల నడుమ చెక్కపల్లిలోని ఆలయం వద్దకు ధ్వజ స్తంభాన్ని తరలించామని చెప్పారు. పూర్ణాహుతి, ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం అనంతరం వేలాదిమందికి అన్నదానం చేస్తామని చెప్పారు.

ఆన్‌లైన్‌ సేవా కేంద్రం ప్రారంభం



కంచికచర్ల: ఉపాధ్యాయుల బదిలీల ఆన్‌లైన్‌ దరఖాస్తుల సేవలను ఉచితంగా అందజేస్తున్నామని ఐక్య ఉపాధ్యాయ సంఘ (యూటీఎఫ్‌) జిల్లా కార్యదర్శి, జిల్లా నాయకులు డి.హరిప్రసాద్‌, కోపూరు నాగేశ్వరరావు, కామా ప్రభాకర్‌ తెలిపారు. ఏపీఎన్జీఓస్‌ సంఘ కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీ ఆన్‌లైన్‌ దరఖాస్తుల సేవా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ మేరకు సంఘ నాయకులు మాట్లాడుతూ కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఉపాధ్యాయులుగా పనిచేసే వారి బదిలీలను ఆన్‌లైన్‌ దరఖాస్తు సేవలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని రెండు మండలాల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మేరుగ రామారావు, పూల వెంకటేశ్వరరావు, సురేష్‌, విజయ్‌కుమార్‌, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకునేందుకు కృషి



మాట్లాడుతున్న జేడీ హనుమంతరావు

నందిగామ రూరల్‌:పశు వైద్యాధికారులు నిర్దేశించిన సమయానికి తమ లక్ష్యాలను చేరుకునే విధంగా కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు అన్నారు. పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో డీడీ డాక్టర్‌ మోజెస్‌ వెస్లీ ఆధ్వర్యంలో డివిజన్‌ స్థాయిలోని పశు సంవర్ధక శాఖాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు రాయితీపై అందజేస్తున్న పశువుల దాణా నిర్దేశించిన సమయానికి పంపిణీ చేయాలని సూచించారు. వికసిత్‌ భారత్‌లో భాగంగా 2025–2047 సంవత్సరాలకు పాలు, గుడ్లు, మాంసం దిగుబడి పెంచే విధంగా పశు వైద్యాధికారులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు శ్రీనివాసులు, పలువురు పశు సంవర్ధక శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్‌ విస్తరణతోపాటు చైనావాల్‌ వద్ద నెలకున్న ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్‌ ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. దుర్గగుడి ఈఓ శీనానాయక్‌ శనివారం దుర్గాఘాట్‌, కనక దుర్గా నగర్‌, చైనావాల్‌ పరిసరాలను పరిశీలించారు. ఈఈ కోటేశ్వరరావు, వన్‌టౌన్‌ సీఐ గురుప్రకాష్‌లతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. దుర్గాఘాట్‌ను విస్తరించడంతోపాటు కొండచరియలు విరిగి పడిన ప్రాంతంలో ఉన్న మట్టిని వెంటనే తొలగించాలన్నారు. దుర్గాఘాట్‌ నుంచి కేశ ఖండనశాల వరకు నిర్మించిన సబ్‌వేను త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆషాఢం సారె, శాకంబరీ ఉత్సవాలు, శ్రావణమాసం, దసరా ఉత్సవాలకు సంబంధించిన పనులను ఇప్పటి నుంచే చేపట్టాలన్నారు. దేవస్థానం చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చూడాలని ఈఈ కోటేశ్వరరావుకు సూచించారు.

వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ

నందిగామ రూరల్‌:పట్టణంలోని సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. మెయిన్‌ బజార్‌లో ఏర్పాటు చేసిన సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శనివారం వెల్లంకి రామచంద్రరావు కుటుంబ సభ్యులు, హర్యానా జిలేబీ నిర్వాహకులు భగీరథ, జగదీష్‌ల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగతో పాటు ప్రతి రోజు చల్లని తాగు నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



తిరువూరులో డివిజన్‌ స్థాయి యోగా వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆర్డీఓ తదితరులు



మైలవరంలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న పీడీ నాగరాజు

మైలవరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ కె. నాగరాజు అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులతో శనివారం కథల పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం చేయించారు. యోగాకు సంబంధించిన వాయు ముద్ర, శూన్య ముద్ర, సూర్య ముద్ర, ప్రణయ ముద్రతో పాటు వివిధ రకాల ముద్రలపై అవగాహన కల్పించి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై డివిజినల్‌ వర్క్‌షాప్‌..

తిరువూరు: అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా తిరువూరు వాహినీ ఇంజినీరింగ్‌ కళాశాల ఆడిటోరియంలో శనివారం డివిజన్‌ స్థాయి యోగా వర్క్‌షాప్‌ నిర్వహించారు. నిత్య జీవితంలో యోగాసనాల ఆవశ్యకతను మాస్టర్‌ ట్రయినర్స్‌ వివరించారు. యోగాసనాలు వేసే ప్రక్రియను ప్రభుత్వాధికారులు, సిబ్బందికి తెలిపారు. ప్రతి రోజూ యోగా చేయడం వలన మానసిక వికాసం, ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయని ఆర్డీఓ మాధురి వివరించారు. నగర పంచాయతీ కమిషనర్‌ లోవరాజు, రెవెన్యూ, మునిసిపల్‌, సచివాలయ ఇబ్బంది పాల్గొన్నారు.

స్కిజోఫ్రేనియాపై అవగాహన ర్యాలీ



ఏరియా ఆస్పత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నూజివీడు: స్కిజోఫ్రేనియా అనేది మానసిక రుగ్మత అని, దీనికి సకాలంలో చికిత్స చేయించుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆర్‌. నరేంద్రసింగ్‌ అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రేనియా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నరేంద్రసింగ్‌ మాట్లాడుతూ తమలో తాము మాట్లాడుకోవడం, అస్తవ్యస్తమైన ఆలోచన, మాట్లాడటంలో అసంబద్ధత, తరచూ గందరగోళానికి గురికావడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి 16 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సులో వస్తుందని, పిల్లల్లో స్కిజోఫ్రేనియా చాలా అరుదుగా వస్తుందన్నారు. ఈ వ్యాధికి నేడు అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఈ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌ఎంఓ శ్రీనివాస్‌, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ పద్మజారాణి, ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బి.లక్ష్మణరావు

ఇబ్రహీంపట్నం: ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్‌ ఎస్‌ఐ బి.లక్ష్మణరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో పలువురు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్‌ వాహనానికి సంబంధించిన పత్రాలు, లైసెన్స్‌ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్‌ సమయంలో వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. మద్యం తాగినా, వన్‌వేలో వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలో ప్రయాణికులు వస్తువులు మర్చిపోయినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు ఆటోలో కనిపించినా సమీపంలోని పోలీస్‌ స్టేషన్‌, 112 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం అందించాలని కోరారు.

కరాటే సాధనతో ఆత్మస్థైర్యం పెంపు

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): పాఠశాల దశ నుంచి కరాటే సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని కేబీఎన్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.కృష్ణవేణి పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే తరగతుల్లో శిక్షణ పొంది, వివిధ బెల్టు గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు శనివారం బెల్టులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ కరాటే సాధన ద్వారా శారీరకంగా చక్కటి ఆరోగ్యం పొందవచ్చన్నారు. క్రమశిక్షణ కూడా అలవడుతుందన్నారు. హిందూహైస్కూల్స్‌ పరిపాలనాధికారి డాక్టర్‌ వి.నారాయణరావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తమ కళాశాల తరపున పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మానసిక దృఢత్వానికి కరాటే సాధన దోహదపడుతుందని పేర్కొన్నారు. వైస్‌ ప్రిన్సిపాల్స్‌ డాక్టర్‌ ఎం. వేంకటేశ్వరరావు, పీఎల్‌ రమేష్‌, కరాటే శిక్షకురాలు జి.వరలక్ష్మీదేవి పాల్గొన్నారు.